తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:64

24 క్యారెట్లు 141,457.00 | కిలో వెండి 2,00,000.00 | chourastha Digitals | 03.11.20256 మంగళవారం, హైదరాబాద్

సంక్షోభంలోనూ భారత్ ఆర్థికవృద్ధి

- పదేళ్లలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోకపోయి ఉంటే
- మిగతా దేశాల కంటే భారత్ మరింత తీవ్రమైన ఇంధన సంక్షోభం
- భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో లో
- ప్రధాని నరేంద్ర మోదీ



2లో

రోడ్లపై చెత్త కనిపించకూడదు..

- ట్రాఫిక్ నిలిచిపోకూడదు
- ఇంటింటికీ ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలి
- నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఇంటింటికీ ప్రతిరోజూ చెత్త సేకరణ చేపట్టాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ జామ్‌లకు శాశ్వత పరిష్కారం చూపేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, గ్రీన్ వాటర్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు

।మిగతా 2 లో।

విదేశీ ఫండ్స్‌తోనే మోదీ ప్రధాని అయ్యారు

- ఇప్పటికీ అదే మద్దతుతో కొనసాగుతున్నాడు
- ఆరోపణలు నిరూపించేందుకు సిద్ధం
- మోదీ బహిరంగ చర్చకు రావాలి
- భారత ఆర్థిక వ్యవస్థ విదేశీ శక్తుల నియంత్రణ, మద్దతుపై ఆధారపడి ఉంది
- విదేశీ సోషల్ మీడియా కూడా మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది
- దేశ ప్రజలకు అబద్ధాలు చెప్పడం మానుకోవాలి
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్



న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ చేసిన విమర్శలకు రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. విదేశీ నిధులు, మద్దతుతోనే మోదీ

।మిగతా 2 లో।



ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధం

హైదరాబాద్ నుంచి అమిత్‌షా సవాల్

కాంగ్రెస్‌ది 'ఓటు బచావో' కాదు
చొరబాటుదారులను కాపాడే ర్యాలీ
తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చారు
రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
ఈవీఎంల ద్వారానే బీజేపీ గెలుస్తుంటే
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ఏర్పడింది
కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR), ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (EVM) విశ్వసనీయతపై చర్చకు తాను సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సవాల్ విసిరారు. హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ పార్టీకి ఈ సవాల్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈవీఎంల ద్వారా బీజేపీ గెలుస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోందని, అదే నిజమైతే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓటు బచావో' ర్యాలీలపైనా తీవ్ర విమర్శలు చేశారు.





చేతులెత్తేసిన ప్రభుత్వం.. అప్పులపాలైన అన్నదాతలు



- నీళ్లున్నా ఎత్తలేని దుస్థితి.. రైతుల కళ్లల్లో కన్నీళ్లు!
- ఇది ప్రకృతి కరువు కాదు..
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏర్పడిన కరువు
- కుప్పానికి నీళ్లు.. పాలమూరుకు కన్నీళ్లా?
- రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

రాష్ట్రంలో నదులు, ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నా పాలమూరు రైతుల పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఇది ప్రకృతి సృష్టించిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలనా వైఫల్యం వల్ల ఏర్పడిన కరువని మండిపడ్డారు. సాగునీటిని సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

।మిగతా 2 లో।



'పుర'పోరు కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికి ఫలితాల ట్రెండ్స్
- 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీల ఫలితాలపై ఉత్కంఠ
- సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ కేంద్రాలు
- గుర్తింపు కార్డులున్న వారికే అనుమతి

2లో

అనిరుద్ రెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్

- వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో చర్చ
- నిధుల విడుదలపై ప్రభుత్వానికి అల్టిమేటం
- నిధులు విడుదల చేయకపోతే 30 వేల మందితో దీక్ష చేస్తాం
- పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే ఊరుకోం
- ఫోన్ చేసి క్లాస్ తీసుకున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

2లో



భూ వివాదాలులేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- జాయింట్ సర్వేను స్వయంగా పర్యవేక్షిస్తా
- రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రజలు, రైతులు, భూయజమానులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో



ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధం

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

హైదరాబాద్‌లో బీజేపీ నిర్వహించిన మహాపాద యాత్రలో అమిత్‌షా పాల్గొన్నారు. నిజాం కాలేజీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మొజాంజాహీ మార్కెట్ వరకు కొనసాగింది. సుమారు కిలోమీ టరున్నర మేర సాగిన పాదయాత్రలో ఆయన కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. మొజాంజాహీ మార్కెట్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో అమిత్‌షా కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్నది ఓటు బచావో ర్యాలీ కాదని, చొరబాటుదారులను కాపాడే ర్యాలీ అని విమర్శించారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నిప్రయత్నాలు చేసినా చొరబాటుదారుల కు ఓటు హక్కు దక్కనివ్వబోమని అన్నారు.

చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదా? ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయకూడదా? నకిలీ ఓట్లను తొలగించకూడదా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొ



లగించారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, దేశంలో లేని వారి పేర్లతో నమోదైన ఓట్లు మూడు కోట్లకు పైగా ఉన్నాయని పేర్కొన్నారు. చొరబాటుదారుల ను భారత్ నుంచి వెళ్లగొడతామని స్పష్టం చేశారు. ఈవీఎంలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను అమిత్‌షా ప్రస్తావించారు. ఈవీఎంల ద్వారానే బీజేపీ గెలుస్తోందన్న వాదనలో నిజం ఉంటే తె లంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా అధికారంలోకి వచ్చాయని నిలదీశారు. 2014, 2019 ఎన్నికల్లో SIR లేకుండానే నరేంద్ర మోదీ విజయం సాధించ లేదా? అని ప్రశ్నించారు. దేశంలో బీజేపీకి ప్రజాద రణ పెరుగుతోందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని అమిత్‌షా ఆరోపించారు. మోదీ పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని, అలాంటి పార్టీ మోదీతో పోటీపడగలదా? అని వ్యాఖ్యానించారు. అనేక రాష్ట్రాల్లో దశాబ్దా లుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోతోందని విమర్శించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అమిత్‌షా తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మార్చారని విమర్శించారు. రాహుల్, రేవంత్ ట్యాక్స్ పేరుతో వసూళ్లు జరుగుతున్నాయని ఆరో పించారు. తెలంగాణ నుంచి వసూలు చేస్తున్న డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ అవినీతిని అడ్డుకునే శక్తి బీజేపీకి మాత్రమే ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవినీతిని బీఆర్ఎస్ అడ్డుకుంటుందా? ఎంఐఎం అడ్డుకుం టుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు, కార్యకర్తలు మద్ద తుగా నిలవాలని కోరారు.త్వరలోనే దేశాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తామని అమిత్‌షా ప్రకటిం చారు. తరచూ విదేశాలకు పారిపోయే వ్యక్తులు దేశానికి అవసరమా? అని ప్రశ్నించారు. బీజేపీ ఎల్లప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు క్షేత్రస్థా యిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషితో నిజాం పాలన నుంచి హైదరాబాద్‌కు విముక్తి లభించిందని ఈ సంద ర్భంగా గుర్తుచేశారు.





అమిత్ షా మహా పాదయాత్రలో పాల్గొన్న రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి,తెలంగాణ చౌరస్తా:

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన మహా పాదయాత్రలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి మరబోయిన రవికుమా ర్ యాదవ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు శేరిలిం గంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాదయాత్ర లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో శేరిలిం గంపల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గంగాధర్, కరచర్ల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.అవినీతి రహిత పాలన, ప్రజాస్వామ్య పరి రక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ మహా పాదయాత్రలో వేలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సా హంగా పాల్గొని తమ సంఘీభావాన్ని చాటుకున్నారు.

సంక్షోభంలోనూ భారత్ ఆర్థికవృద్ధి

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

పశ్చిమాసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటి కీ, భారత్ ఆర్థిక వృద్ధి బలంగా ముందుకు సాగు తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. నిరంత రాయంగా శిలాజ ఇంధనాలపై (ఫాసిల్ ఫ్యూయె ల్స్) అతిగా ఆధారపడటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవ స్థ అతలాకుతలం అవుతోందని వ్యాఖ్యానించారు. ఇంధన భద్రత భవిష్యత్తు అంతా క్లీన్ ఎనర్జీలోనే (స్వచ్ఛ ఇంధనం) దాగి ఉందని ఆయన స్పష్టం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 'భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో (BRESE) 2026' సదస్సును ప్రారంభించిన అనంతరం మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సం దర్భంగా ప్రపంచ సంక్షోభాలు ప్రతి దేశానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయని మోదీ అన్నారు. ఇంధన భద్రతకు ఆర్థిక స్థిరత్వంతో ఉన్న బలమైన సంబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఫాసిల్ ఫ్యూ యెల్స్ నిల్వలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పరిమి తంగా ఉన్నాయని, అయితే పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యానికి అంతులేదని వివరించారు. ప్రతి ప్రాంతం, ప్రతి దేశం కూడా సోలార్, విండ్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను విని యోగించుకునే అవకాశం ఉందని చెప్పారు.గత దశాబ్ద కాలంలో భారత్ సకాలంలో దేశీయంగా పెట్టుబడులు పెంచడం, పలు కీలక కార్యక్రమాల్ని అమలు చేయడం వల్ల అంతర్జాతీయ పరిణామాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై మరీ ఎక్కువగా పడకుండా అడ్డుకోగలిగామని ప్రధాని వివరిం చారు. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధించిన పురోగతిని మోదీ వివరించారు. భారత స్వచ్ఛ ఇంధన రంగాన్ని కేవలం హైడ్రో, సోలార్, విండ్, న్యూక్లియర్ విద్యుత్ వనరులకే పరిమితం చేయట్లేదని, గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ ముందడుగు వేయడా నికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో సగానికిపైగా వాటాను నాన్ ఫాసిల్ ఇంధన వనరుల ద్వారా సాధించాలనే 'పారిస్ ఒప్పందం' లక్ష్యాన్ని నిర్దేశించిన సమయం కంటే ఐదేళ్ల ముందుగానే, అంటే 2025 నాటికే భా రతదేశం విజయవంతంగా చేరుకుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం దేశ మొత్తం విద్యుత్ సామర్థ్యంలో ఈ శిలాజయేతర వనరుల వాటానే 50 శాతానికిపైగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని సాధించాలనే 'COP26' లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తూ ఇప్పటికే దాదాపు 300 గిగా వాట్ల మైలురాయిని చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు.రానున్న 1011 ఏళ్లలో దేశీయంగా మరో 500 గిగావాట్ల శిలాజయేతర విద్యుత్ సామర్థ్యా న్ని అదనంగా జోడించడమే భారతదేశ తదుపరి లక్ష్యమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సూర్య ఘర్ పథకంతో 65 లక్షల ఇళ్లకు ప్రయోజనం

ఇళ్లపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ఉద్దే శించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పురోగతిని మోదీ వివరించారు. 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా కోటి కుటుంబాల కు ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నా రు. గత రెండేళ్లలో 65 లక్షలకుపైగా ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం అందిందని తెలిపారు. దీంతో ఆయా కుటుంబాల విద్యుత్ బిల్లులు సుమారు 76 శాతం తగ్గాయని చెప్పారు. ఇదే సమయంలోపీఎం కుసుమ్ పథకం కింద 30 లక్షలకుపైగా రైతులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం కలు గుతోందని ప్రధాని పేర్కొన్నారు. దీని కింద ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ. 1 లక్ష వరకు ఆదా అవుతున్నట్లు అంచనా వేశారు. అలానే 44 వేలకు పైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థల వల్ల ఏటా దాదాపు రూ. 700 కోట్ల మేర ఆదా అవుతుందని వెల్లడించారు.

విదేశీ ఫండ్స్‌తోనే మోదీ ప్రధాని అయ్యారు

తరువాయి భాగం

ప్రధాని అయ్యారని, ఇప్పటికీ అదే మద్దతుతో పదవిలో కొనసాగుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.సోమవారం సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ ఈ మేరకు పోస్టు చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ విదేశీ శక్తుల నియంత్రణ, మద్దతుపై ఆధారపడి ఉందని, విదేశీ సోషల్ మీడియా కూడా మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశ ప్రజలకు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని ప్రధానికి సూచించారు. ఏ వేదికపైనైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని, ధైర్యం ఉంటే రావాలని సవాల్ విసిరారు. విదేశీ మద్దతుపై తాను చేసిన ఆరోపణలపై చర్చిం చేందుకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ స్పష్టం చేశారు. తనకు తెలిసిన విషయాలపై చర్చించడా నికి మోదీ భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. అయితే ఇవన్నీ రాహుల్ చేసిన రాజకీయ ఆరోపణ లేనని, వాటికి సంబంధించిన ఆధారాలు లేదా స్వ తంత్ర నిర్ధారణను ఈ ప్రకటనలో వెల్లడించలేదు. గుజరాత్‌లోని నర్మదా జిల్లా ఏక్తా నగర్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వ హించిన జాతీయ ఐక్యతా దినోత్సవంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రతిపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు.ప్రజాస్వామ్యంలో ప్రతిప క్షాల బాధ్యత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, వాటిని వ్యతిరేకించడమేనని పేర్కొన్న మోదీ.. ప్రస్తుతం ప్రతిపక్షాలు దేశ అభివృద్ధి కార్యక్రమా లకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తు న్నాయని విమర్శించారు.దేశాన్ని విభజించేందు కు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని, విదేశాల్లో భారత్‌కు వ్యతిరేకంగా ఉన్న శక్తులతో కొందరు సంబంధాలు కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించా రు. సోషల్ మీడియాను ఆయుధంగా ఉపయో గించుకుంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నా లను సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్ర విమ ర్శలు చేశారు. భారత్‌లో అశాంతి, అస్థిరత సృష్టిం చేందుకు ప్రయత్నిస్తున్న విదేశీ శక్తులకు రాహుల్ గాంధీ ఒక సాధనంగా మారారని ఆరోపించారు. కోల్‌కతాలో సోమవారం నిర్వహించిన బీజేపీ ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి చేపట్టిన 'ఓట్ చోరీ' ప్రచారానికి వ్యతిరే కంగా బీజేపీ ఈ ర్యాలీ నిర్వహించింది. నేపాల్ సహా ఇతర పొరుగు దేశాల్లో అశాంతిని సృష్టిం చేందుకు ప్రయత్నించిన శక్తులే ఇప్పుడు భారత్‌ను అస్థిరపరిచేందుకు చూస్తున్నాయని, అలాంటి శక్తులు రాహుల్ గాంధీని ఉపయోగించుకుం టున్నాయని నితిన్ నబిన్ ఆరోపించారు.ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ పరస్పర విమర్శలు, బీజేపీ నేతల ఎదురుదాడితో జాతీయ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం వేడెక్కింది.

రోడ్లపై చెత్త కనిపించకూడదు..

తరువాయి భాగం

చేశారు.హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్య ని ర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదే శించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, సేకరించిన చెత్తను సక్రమంగా తరలించే వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. నిర్మాణ వ్యర్థాల తర లింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఆయా పారిశ్రామిక వాడల అధికారులతో సమ న్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.నిర్మాణ రంగం, పార్కుల నిర్వహణ, గ్రీనరీ అభివృద్ధి, ల్యాండ్‌స్కేపింగ్ వంటి అవసరాలకు తాగునీటిని వినియోగించకుండా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని ఉపయోగించేలా అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. జలమండలి తొలివిడతలో 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు.సీడీఎంఏ పరిధితో పాటు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సర ఫరాను మరింత విస్తరించాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని గరిష్ఠంగా వినియోగించడం ద్వారా తాగునీటి వనరులను ఆదా చేయవచ్చని పే ర్కొన్నారు.నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారా నికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపో కలకు అంతరాయం కలగకుండా అవసరమైన చోట సిగ్నల్ ఫ్రీ జంక్షన్లను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందుకోసం అండర్‌పాస్‌లు, ఎలి వేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అవసరమైన ప్రణా ళికలు సిద్ధం చేయాలని చెప్పారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోకుండా నిరంతరాయంగా ట్రాఫిక్ కొనసాగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నగరాన్ని క్లీన్ అండ్ ట్రాఫిక్ ఫ్రీ సిటీగా మార్చే లక్ష్యంతో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, జి. సృజన తది తరులు పాల్గొన్నారు.

'పుర'పోరు కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

తెలంగాణ చౌరస్తా, ఆంధ్రప్రదేశ్ :

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించిన ఓట్లను లెక్కించేందుకు ఆయా కేంద్రాల్లో టేబుళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు. నామినే షన్ల సమయంలో, పోలింగ్ రోజున చోటుచేసుకు న్న ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.కౌంటింగ్ ప్రారంభమైన వెంటనే తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం వార్డు సభ్యులు, కార్పొరేటర్ అభ్యర్థు లతోపాటు మేయర్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈసారి మేయర్ స్థానాలకు కూడా ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వ హించడంతో వార్డుల ఫలితాలతోపాటు మేయర్ అభ్యర్థుల ఫలితాలపై ఆసక్తి నెలకొంది. మంగళ వారం మధ్యాహ్నానికి కౌంటింగ్ ట్రెండ్స్ వెలువడే అవకాశం ఉండగా, రాత్రికి పూర్తి ఫలితాలు వెల్ల డయ్యే అవకాశం ఉంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,942 వార్డులు, డివిజన్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇందులో కార్పొరేషన్ల పరిధిలో 922 డివిజన్లు ఉండగా, మున్సిపాలి టీలు, నగర పంచాయతీల పరిధిలో 3,020 వార్డులు, డివిజన్లు ఉన్నాయి. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొన సాగించనున్నారు. సంబంధిత అభ్యర్థులు, వారి ఏజెంట్లు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు మాత్రమే నిబం ధనల ప్రకారం లోపలికి అనుమతి ఇవ్వనున్నారు. కౌంటింగ్‌లో విజయం సాధించిన నూతన వార్డు సభ్యుల ద్వారా నవంబర్ 5, 6 తేదీల్లో డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహించనున్నా రు. ఈ ఎన్నికలతో పట్టణ స్థానిక సంస్థల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ పూర్తికానుంది.

మొత్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం కావడంతో అభ్యర్థు ల్లో ఉత్కంఠ నెలకొంది. ఎవరికి పట్టం కట్టారో, ఏ పార్టీకి ఆధిక్యం లభించనుందో తేల్చేందు కు మంగళవారం వెలువడనున్న ఫలితాల కోసం రాజకీయ వర్గాలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

భూ వివాదాలులేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

రాష్ట్రంలో రెవెన్యూ, అటవీ భూముల మధ్య నెల కొన్న సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా జాయింట్ సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని వెల్లడించారు.సచివాలయంలో సోమవారం రెవెన్యూ, అటవీ శాఖలు, సర్వే, సెటి ల్‌మెంట్ విభాగాల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో దశాబ్దాలు గా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలపై చర్చిం చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి పేర్కొ న్నారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో అధికంగా అటవీ భూములు ఉన్ననేపథ్యం లో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య కొన్ని దశాబ్దాలు గా సరిహద్దు వివాదాలు కొనసాగుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. పట్టా భూములు, రెవెన్యూ భూములు, అటవీ భూముల మధ్య ఉన్న వివాదాల న్నింటినీ సమగ్రంగా పరిశీలించి జాయింట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారు లకు సూచించారుఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించాలని ఆదేశించారు. భూముల రికార్డులు, మ్యాపులు, గత సర్వే వివరాలను క్షు ణ్ణంగా పరిశీలించి స్పష్టమైన హద్దులను నిర్ధారిం చాలని పేర్కొన్నారు.రెండు శాఖల మధ్య సరిహద్దు వివాదాల కారణంగా సామాన్య ప్రజలు, రైతులు, భూయజమానులు ఎలాంటి ఇబ్బందులు ఎదు ర్కోకూడదని మంత్రి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతను నెట్టివేసే ధోరణిని విడనాడాలని సూచించారు. పరస్పర సమన్వయంతో పారదర్శకంగా, వాస్తవ ఆధారాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.గ్రామస్థా యి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించా రు. క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను అక్కడే పరిష్కరించాలని, ఉన్నతస్థాయి నిర్ణయాలు అవసరమైన అంశాలను వెంటనే రాష్ట్రస్థాయి అధి కారుల దృష్టికి తీసుకురావాలని సూచించారుఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ వివాదాల పరిష్కా రంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని పొంగులేటి స్పష్టం చేశారు. జాయింట్ సర్వే ప్రక్రియతో పాటు రెండు శాఖల మధ్యసమన్వయంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తానని, సర్వే పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తానని మంత్రి వెల్లడించారు.



అనిరుద్ రెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

సొంత పార్టీ ప్రభుత్వంపైనే వరుసగా విమర్శలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సీరి యస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోం ది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యేకు ఫోన్ చేసి మాట్లా డటంతో పాటు, పార్టీ క్రమశిక్షణను పాటించాలని సూచించినట్లు సమాచారం.మొదటిసారి ఎమ్మెల్యే గా ఎన్నికైన అనిరుద్ రెడ్డి తన వ్యాఖ్యలతో తరచూ రాజకీయంగా చర్చకు దారితీస్తున్నారు. గతంలో సొంత పార్టీ నేతలు, ప్రభుత్వ నిర్ణయాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.తెలంగా ణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయ వర్గాల్లో కలకలం రేపాయి. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టుల విషయంలోనూ ఆయన చేసిన ఆరోపణలు చర్చ నీయాంశమయ్యాయి.రాష్ట్రంలో మళ్లీ ఇప్పుసారా దుకాణాలు ప్రారంభించాలని, గతంలో సారా తాగినవారు 115 ఏళ్లు జీవించారంటూ అనిరుద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. సినీ నటులకు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్స్ పరీక్ష లు నిర్వహించాలని కూడా ఆయన సూచించారు. మరో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాను కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని అవుతానంటూ చేసిన వ్యా ఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణ మయ్యాయి.ఇటీవల జడ్చర్ల నియోజకవర్గ అభివృ ద్ధి పనులకు నిధులు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మరోసారి ఆయన వార్తల్లో నిలిచారు. నిధులు విడుదల చేయకపోతే 30 వేల మందితో దీక్ష చేపడతానని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తన ప్రాణం పోయినా సరే నియో జకవర్గానికి నిధులు సాధిస్తానని, తాను చనిపో యిన తర్వాతే నిధులు ఇస్తారా? అంటూ ప్రభుత్వ తీరుపై ప్రశ్నలు సంధించారు.ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బహిరంగంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమనే సంకేతాలు ఇచ్చారు. తాజాగా ఫోన్ ద్వారా మాట్లాడిన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కు వడ్డీల చెల్లింపులు, పెండింగ్ బిల్లుల విడుదల లో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్లు సమాచారం.ఇదే సమయంలో ఇతర నియోజక వర్గాల్లోనూ నిధుల సమస్యలు ఉన్నాయని, ప్రభు త్వంపై బహిరంగంగా విమర్శలు చేసే విషయంలో సంయమనం పాటించాలని సూచించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఒకవైపు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కోరుతూ ఎమ్మెల్యే పట్టుబడుతుండగా, మరోవైపు సొంత ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు పార్టీకి ఇబ్బంది కరంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. పీసీసీ చీఫ్ సూచనలతోనైనా అనిరుద్ రెడ్డి తన వ్యాఖ్యల తీరును మార్చుకుంటారా? ప్రభుత్వంపై విమర్శలకు స్వస్తి చెబుతారా? అనేది ఇప్పుడు కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

చేతులెత్తేసిన ప్రభుత్వం.. అప్పులపాలైన అన్నదాతలు

తరువాయి భాగం

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఎండిపోయిన వరిపొలాలను సోమవారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి,ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్‌రావు పరిశీలించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీరు అందక నష్టపోయిన రైతులను పరామర్శించారు. అనంతరం నిర్వహిం చిన రైతు సభలో రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ఐదు మోటార్లను పూర్తిస్థాయిలో నడిపితే నెలకు 10 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని హరీశ్‌రావు తెలిపారు. ఐదు నెల్లో 50 టీఎంసీల నీటిని వినియో గించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని ఆరోపించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 221 టీఎంసీల

త్యాగాల కుటుంబానికి తీరని కష్టాలు..

పట్టించుకోని పాలకులు

- ఒకే ఇంట్లో ముగ్గురు అమరులు..
- నేడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న దొడ్డి కొమురయ్య వారసులు
- విగ్రహాలకు పూలమాలలు.. వేదికలపై ఘన నివాళులు..
- కానీ కుటుంబానికి మాత్రం అందని ప్రభుత్వ సాయం
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన తండ్రి..
- ఫిట్స్‌తో బాధపడుతున్న తల్లి..
- ప్రైవేట్ ఉద్యోగంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మనవడు

తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్ :



సీఎం రేవంత్ రెడ్డికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

తెలంగాణ ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా నిలవాలని వారసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కుటుంబానికి తగిన ఆర్థిక సాయం అందించడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం, నివాస, జీవనోపాధి భద్రత కల్పించాలని కోరుతున్నారు.విగ్రహాలకు పూలమాలలు వేయడం, సభల్లో ప్రసంగాలు చేయడం మాత్రమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి కాదు.. వారి ఆశయాల కోసం పోరాడిన కుటుంబాలను ఆదుకోవడమే అసలైన గౌరవం. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి దొడ్డి కొమురయ్య వారసులకు న్యాయం చేస్తుందా? అన్నది వేచి చూడాలి.

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కుటుంబం చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పోరాట యోధులు ప్రజల కోసం ప్రాణాలు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు నేటికీ రాజకీయ, సామాజిక వేదికలపై మారుమోగుతోంది. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. వరంగల్ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలనే డిమాండ్లు సైతం వినిపిస్తున్నాయి. అయితే ఆ మహనీయుడి కుటుంబం నేడు ఎలాంటి పరిస్థితుల్లో ఉందనే విషయాన్ని మాత్రం పాలకులు పట్టించుకోవడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.జనగామ జిల్లా కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఒకప్పుడు భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడిన కుటుంబం.. నేడు కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. అమరుల త్యాగాలకు గుర్తింపుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు.. వారి వారసుల సంక్షేమంపై దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అమరులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రలో కడవెండి గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. దొడ్డి కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు పోరాటంలో కీలక పాత్ర పోషించారు.

దొడ్డి మల్లయ్య: భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభలో చేరి ప్రజలను సంఘటితం చేశారు. 1946 జూలై 4న విస్నూరు రామచంద్రారెడ్డి అనుచరులు జరిపిన కాల్పుల్లో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లకు బుల్లెట్లు తగలడంతో అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ 1951లో మరణించారు.

దొడ్డి కొమురయ్య: 1946 జూలై 4న జరిగిన కాల్పుల్లో 19 ఏళ్ల కొమురయ్య ప్రాణాలు కోల్పోయారు. భూస్వాముల సాయుధ మూకల దాడిని ధైర్యంగా ఎదుర్కొంటూ అమరుడయ్యారు. ఆయన మరణం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మరింత ఊపునిచ్చింది. ఈ ఘటన తెలంగాణ చరిత్రలో కీలక మలుపుగా నిలిచింది.

దొడ్డి ఆగయ్య: కుటుంబ త్యాగాల పరంపర అక్కడితో ఆగలేదు. 1947లో దొడ్డి ఆగయ్యను కూడా నిరంకుశ పాలకుల అనుచరులు చెట్టుకు కట్టేసి కాల్చిచంపినట్లు కుటుంబ చరిత్ర చెబుతోంది.

ఇలా ఒకే కుటుంబం నుంచి ముగ్గురు ప్రాణత్యాగం చేయడం తెలంగాణ పోరాట చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచిపోయింది.

అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం సతమతం

నాడు ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించిన ఆ కుటుంబ వారసులు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొడ్డి కొమురయ్య మనవడు దొడ్డి చంద్రం కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలుస్తోంది.చంద్రం తండ్రి భిక్షపతి గతంలో చెట్టుపై నుంచి కిందపడటంతో నడుముకు తీవ్ర గాయమై మంచానికే పరిమితమయ్యారు. రోజువారీ కనీస అవసరాలకు కూడా ఇతరుల సహాయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు తల్లి అనసూయ ఫిట్స్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కుటుంబంలోని మరో సభ్యుడు కూడా మానసిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకున్న దొడ్డి చంద్రం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.వచ్చే కొద్దిపాటి ఆదాయంతో ఇంటి ఖర్చులు, వైద్య అవసరాలు తీర్చడం భారంగా మారిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సభలు, సన్మానాలకే పరిమితమైన గుర్తింపు?

దొడ్డి కొమురయ్య పేరు చెప్పగానే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నారు. విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలనే డిమాండ్లు కూడా తెరపైకి వస్తున్నాయి.అయితే ఆ మహనీయుడి కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను పరిష్కరించేందుకు మాత్రం తగిన చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అమరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాలు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

80 ఏళ్ల తర్వాతైనా న్యాయం జరిగేనా?

దొడ్డి కొమురయ్య అమరత్వం పొంది ఎనిమిది దశాబ్దాలు గడిచినా ఆయన కుటుంబానికి సరైన గుర్తింపు, భరోసా అందలేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఆయన శతజయంతి వేడుకల నేపథ్యంలోనైనా ప్రభుత్వం ఈ కుటుంబ పరిస్థితిని పరిశీలించి ఆదుకోవాలని వారసులు కోరుతున్నారు.



కాంగ్రెస్ అబద్ధపు
ప్రచారాలను తిప్పికొడతాం

- హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల హక్కుల సాధనే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర విజయవంతంగా సాగింది.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరైన ఈ మహా పాదయాత్రకు హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శ్రేణులతో కలిసి హాజరై తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టడానికే బీజేపీ ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి, అరాచక పాలనకు స్వస్తి పలకడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార మే లక్ష్యంగా బీజేపీ ఎల్లప్పుడూ ప్రజల గొంతుకగా నిలుస్తుందని, రాబోయే రోజుల్లో కూడా ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ తో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



షార్ట్ సర్క్యూట్ తో సామాగ్రి దగ్ధం

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో ఉన్న సామాగ్రి దగ్ధమైన ఘటన సోమవారం మండల పరిధిలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు..... మండలంలోని కొమ్మనపల్లి తండాకు గుగులోతు బిచ్యా ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.ఇంట్లోని సామగ్రి మొత్తం కాలి బూడిదయింది. బాధితులు కట్టు దుస్తులతో మిగిలారు. బిచ్యా, అతని భార్య దర్జని ఉదయం ఇంటికి తాళం వేసి ఎవరి పనిపై వారెళ్లారు. సుమారు 11 గంటలకు ఇంట్లో నుంచి దట్టమైన పొగలు బయటికి రావడంతో స్థానికులు బిచ్యాకు సమాచారం అందించారు. ఆయన వచ్చేసరికి అప్పటికే ఇంట్లో దట్టమైన మంటలు కనిపించాయి. స్థానికులు బకెట్ లతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, దుస్తులు, రూ.70 వేల నగదు కాలి బూడిదయ్యాయి. సర్పంచ్ స్వరూప నరేందర్ ఘటనా స్థలిని సందర్శించి బాధితులను ఓదార్చారు.జీపీఓ లలిత వివరాలు నమోదు చేసుకున్నారు.ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

AIPSO రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్ గౌడ్

- శాంతి, సోదరభావం పెంపొందించేందుకు కృషి చేస్తా
- చంద్రశేఖర్ గౌడ్

మహేశ్వరం, తెలంగాణ చౌరస్తా :



అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (AIPSO) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా వనస్థలిపురానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, అయ్యప్ప సేవకుడు, గురుస్వామి సుంకరి చంద్రశేఖర్ గౌడ్ నియమితులయ్యారు.ఆదివారం ఎన్టీఆర్ నగర్ మార్కెట్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన AIPSO రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలో ఆయన నియామకాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా సుంకరి చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో శాంతియుత మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (AIPSO) బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన AIPSO రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, రాష్ట్ర నాయకులు పల్లె వినయ్ కుమార్‌తో పాటు జిల్లా ప్రతినిధులకు చంద్రశేఖర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



జర్నలిస్ట్ ఉపేందర్‌కు ఎర్రబెల్లి పరామర్శ

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొర్రూరు మన ప్రగతి జర్నలిస్ట్ రాయిశెట్టి ఉపేందర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఉపేందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎర్రబెల్లి దయాకర్ రావు, మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.అనంతరం ఉపేందర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఉపేందర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



- ప్రతి డివిజన్‌లో 3 వేల నుంచి 4 వేల ఓట్లు నమోదు చేయించాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు.శేరిలింగంపల్లి పరిధిలోని ఉమ్మడి చందానగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డితో కలిసి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఓటరు నమోదు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి డివిజన్‌లో 3 వేల నుంచి 4 వేల మంది పట్టభద్రుల ఓట్లు నమోదు చేయించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ పట్టభద్రులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చందానగర్ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు
నమోదు చేసుకోవాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కోరారు.మండలంలోని హరిపిరాల గ్రామంలో సోమవారం ఓటు నమోదు ప్రక్రియ గడువు ముగియనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దయాకర్ రావు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ చెంచెర్ల స్వాతి రాజు,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండ వెంకన్న, గ్రామ ఇన్చార్జి అంకుస్, ఉప సర్పంచ్, పిఎసిఎస్ డైరెక్టర్ వల్లపు లింగయ్య, మాజీ సర్పంచ్ గద్దల బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ కోదునూరి సధాకర్, తోట మురళి, వల్లపు ఐలోను, బుర్రి మురళి, వెంకన్న,ఉపేందర్,కమలాకర్,బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్

అబ్దుల్లాపూర్ మెట్, తెలంగాణ చౌరస్తా:

అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని పాత గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామంలోని ఎస్సీ కాలనీలో 5 లక్షల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బీసీ కాలనీలోని రామోజీ ఫిలిం సిటీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి సుష్మా అశోక్ గౌడ్, వార్డ్ సభ్యులు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి,మాచగోని మహేందర్ ముదిరాజ్,గడ్డమీద దశరథ గౌడ్, తూర్పునూరి శివకుమార్ గౌడ్, బొడుసు రాఘవేందర్ యాదవ్, బత్తిని దీపిక గౌడ్, దర్శనం యాదయ్య, కేతరాజు నరసింహ, లింగాల అఖిల్ గ్రామ పెద్దలు,నాయకులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.





పోలీసుల ఆకస్మిక వాహన తనిఖీలు

- తనిఖీలు విస్తృతం చేసిన ఎస్ఐ దేవ్ సింగ్
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:

పట్టణంలో పోలీసులు ఎస్ఐ దేవ్ సింగ్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనాలు, కార్లను నిలిపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సి వంటి ధ్రువపత్రాలను కూలంకషంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేవ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని మరియు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియకు తుది గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 6న చివరి తేదీ కావడంతో నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌కు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కోరారు.పట్టభద్రుల ప్రజాస్వామ్య హక్కును కాపాడటంలో ఓటరు నమోదు కీలకమని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. గడువు ముగిసేలోపు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆమె సూచించారు.

ప్రజారోగ్యంతో ఆటలొద్దు

- చెత్త కాలుష్యంపై ప్రభుత్వం స్పందించాలి
- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్

ఎల్ బి నగర్,తెలంగాణ చౌరస్తా :



ఆటోనగర్‌లోని చెత్త నిల్వ కేంద్రం వల్ల పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని దాన్ని తక్షణమే అక్కడి నుంచి తరలించాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణ సరిగా లేక దుర్వాసన, దుమ్ము, పొగ, భారీ శబ్ద కాలుష్యంతో వందలాది కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ ఒప్పందాలు, చెత్త నిల్వ అనుమతుల వివరాలను ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు వెంటనే వెల్లడించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా భాషనపల్లి మల్లయ్య ఎన్నిక..

నూతనకల్ తెలంగాణ చౌరస్తా:



మండల పరిధిలోని పెదనెమిల గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగా భాషనపల్లి మల్లయ్య ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కాబడిన భాషనపల్లి మల్లయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం నుంచి నన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేసి గౌడ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ కుల నాయకులు గడ్డమీది వెంకటేశం,గొడిశాల రాజమల్లు, సాయిలు,గుండగాని వెంకన్న, రమేష్,గుర్రం వెంకన్న,దూసరి అబ్బయ్య,మెలుగూరి మల్లయ్య,వెంకన్న,రేసు రామస్వామి,భాషలపల్లి యాదగిరి,వెంకన్న,వీరస్వామి, తొనుకునూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి

- దరఖాస్తులు సున్నా

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల అనుసారం ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజావాణికి కార్యక్రమానికివివిధ శాఖలకు చెందిన 19మంది అధికారులు హాజరయ్యారన్నారు. దరఖాస్తులు సున్నా అని,ఎంపీడీవో సురేందర్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ...సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



సైదాపూర్‌పై ఎందుకీ వివక్ష?

- అభివృద్ధిలో వెనుకబడుతున్న మండలం.. - వ్యవసాయం నుంచి విద్య, రహదారులు, పర్యాటకం వరకు సమస్యలే!
- పక్క మండలాలకు వరాలు.. సైదాపూర్‌కు మొండిచేయి
- మూడేళ్లయినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ప్రజల్లో అసంతృప్తి
- సింగిల్ విండో డైరెక్టర్ కాడ ప్రకాశ్ రెడ్డి.

సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:

ఒకే నియోజకవర్గం.. ఒకే ప్రభుత్వం.. ఒకే మంత్రి.. అయినా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మండలాల మధ్య వ్యత్యాసం ఎందుకు? హుస్నాబాద్, కోహెడ మండలాలకు ప్రాధాన్యమిస్తూ సైదాపూర్ మండలాన్ని విస్మరిస్తున్నారని సింగల్ విండో డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, విద్యుత్, విద్య, రహదారులు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు.. ఇలా ఏ రంగాన్ని పరిశీలించినా సైదాపూర్ మండలం అనేక సమస్యలతో సతమతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, అభివృద్ధిపై చేసిన ప్రకటనలు ఆచరణలో కనిపించడం లేదని మండిపడుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఒకవైపు కొన్ని మండలాలకు ప్రాధాన్యం లభిస్తుండగా, మరోవైపు సైదాపూర్‌కు మాత్రం అన్యాయం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

వ్యవసాయంలోనూ చిన్నచూపేనా?

హుస్నాబాద్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ సైదాపూర్ మండలంలో ఇప్పటివరకు ఆ దిశగా కనీస ఏర్పాట్లు పూర్తి కాలేదని రైతులు వాపోతున్నారు. మిల్లుల కేటాయింపు జరగలేదని, గన్నీ సంచులు (బర్దన్) సరఫరా చేయలేదని, కొనుగోళ్ల సన్నద్ధతపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం కూడా నిర్వహించలేదని పేర్కొంటున్నారు. మరోవైపు హుస్నాబాద్, కోహెడ మండలాల్లో రైతులకు 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు అందిస్తుండగా, సైదాపూర్ రైతులకు మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో వ్యత్యాసం

విద్యుత్ సరఫరాలోనూ సైదాపూర్ మండలానికి అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హుస్నాబాద్, కోహెడ మండలాలతో పోలిస్తే సైదాపూర్‌లో రోజుకు రెండు గంటల మేర తక్కువ విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని నిరూపించేందుకు ఆయా మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల డేబుక్‌లను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు. విద్యుత్ సరఫరాలో సమానత్వం పాటించాలని కోరుతున్నారు.

అద్దె భవనాల్లోనే గురుకుల పాఠశాల

విద్యారంగంలోనూ సైదాపూర్ మండలం నిర్లక్ష్యానికి గురవుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహాత్మా జ్యోతిబా ఫూలే బాలుర గురుకుల ఉన్నత పాఠశాల ఇప్పటికీ హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లిలో అద్దె భవనాల్లోనే కొనసాగుతోందని పేర్కొంటున్నారు. సైదాపూర్ మండలంలోని రాయికల్, గోడిశాల తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ సొంత భవనాల నిర్మాణానికి నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు హుస్నాబాద్ మండలంలో వివిధ ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలకు అనుమతులు మంజూరు చేయించి, నిర్మాణాలకు నిధులు కేటాయిస్తూ పనులు వేగవంతం చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. సైదాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను సైతం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధి ఎప్పుడో?

మండలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైదాపూర్ మండల కేంద్రం నుంచి భీమదేవరపల్లి మండల కేంద్రాన్ని కలుపుతూ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎప్పుడు మంజూరు లభిస్తుంది? పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎలబోతారం నుంచి అమ్మనగుర్తి వరకు రహదారి దెబ్బతిని, అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని చెబుతున్నారు. కనీస మరమ్మతుల కోసం డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయాలని మంత్రి కలెక్టర్‌కు సిఫారసు చేసినప్పటికీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని పేర్కొంటున్నారు. జలపాతం దిగువన ఉన్న మోదిచెరువు సుందరీకరణకు కూడా నిధులు కేటాయించలేదని విమర్శిస్తున్నారు. అదే సమయంలో హుస్నాబాద్ మండలంలోని ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నారని పోల్చి చూపుతున్నారు.



ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. బొమ్మకల్ నుంచి వంగర క్రాస్ వరకు రహదారి నిర్మాణ పనులు ఎప్పుడు చేపడతారో చెప్పాలని కోరుతున్నారు.రాయికల్ బస్టాండ్ నుంచి నల్లని తండా వరకు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో బీటీ రోడ్డు మంజూరైందని ఎనిమిది నెలలుగా చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదని స్థానికులు వాపోతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, గుత్తేదారు పనులు ప్రారంభిస్తారని మూడు నెలలుగా అధికారులు చెబుతున్నప్పటికీ సంబంధిత గుత్తేదారు ఇప్పటివరకు ఒప్పందం చేసుకోలేదని గిరిజన సంక్షేమ శాఖ ఏఈ పేర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఈ రహదారి పూర్తయితే రాయికల్, నల్లని తండా, రాయికల్ తండా, పాత తండా మీదుగా ఘనపూర్, సైదాపూర్ వరకు బస్సు రవాణా సౌకర్యం కలుగుతుందని, ప్రస్తుతం ఆయా తండాలకు బస్సులు వెళ్లే పరిస్థితి లేదని గుర్తు చేస్తున్నారు.

పర్యాటక అభివృద్ధికి నిధుల కొరతే!

సహజ సిద్ధమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ సైదాపూర్ మండలంలో పర్యాటక అభివృద్ధి ఆశించిన స్థాయిలో సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. సర్వాయి పాపన్న గుట్ట వద్ద పనులు నత్తనడకన సాగుతుండగా, ప్రకృతి అందాలకు నిలయమైన రాయికల్ జలపాతానికి ఇప్పటివరకు కనీసం అంచనాలు కూడా రూపొందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.జలపాతం వద్ద పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జలపాతానికి వెళ్లే రాయికల్ రహదారి సుమారు ఐదు కిలోమీటర్ల మేర పూర్తిగా తో పాటు అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గాల పునర్విభజన భయంతోనేనా?

మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సైదాపూర్ మండలంలోని అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని సింగల్ విండో డైరెక్టర్ చారకొండ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఇతర మండలాలకు అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యం లభిస్తుండగా సైదాపూర్‌ను ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే సైదాపూర్ మండలం హుజూరాబాద్ నుంచి వేరుపడుతుందనే ఆలోచనతోనే పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారా? అనే అనుమానాలను సైతం కొందరు వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయం నుంచి పర్యాటకం వరకు ప్రతి రంగంలోనూ సమస్యలు పేరుకుపోతున్నాయని, వాటి పరిష్కారానికి మంత్రి చొరవ చూపడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సైదాపూర్ మండలంలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు కేటాయించడం





ఘనంగా నారాయణ జోన్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

- క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన హయత్ నగర్ విద్యార్థులు
- విజేతలకు బహుమతుల ప్రధానం

ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో వనస్థలిపురం జోన్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2026 పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. నారాయణ పాఠశాలల వివిధ శాఖల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు.ఈ క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన పరుగు పందెం,క్రికెట్,ఖోఖో,కబడ్డీ,చెస్ తదితర పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.హయత్ నగర్ నారాయణ బ్రాంచ్ విద్యార్థులు అన్ని రకాల క్రీడలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు జి.కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ,ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జోన్ ఏజీఎం రవీంద్ర బాబు మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జీఎమ్ గోపాల్ రెడ్డి ఆకాంక్షించారు.హయత్ నగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ లావణ్య రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో అకాడమిక్ నైపుణ్యాలతో పాటు స్పోర్ట్స్ ప్రోత్సహించేందుకు ఇటువంటి చక్కని కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యానికి విద్యార్థులు,తల్లిదండ్రుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల యా జ మా న్యం తీసుకుంటున్న చొరవపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానస, ఏఓ అనంత చంద్ర శేఖర్, హైస్కూల్ ఆర్ ఎండ్ డీ శివరంజని, ఎన్ పి ఎల్ ఇన్‌ఛార్జ్ రోహిణి, ఈచాంప్స్ ఆర్ ఏండ్ డీ మహేశ్వరి,ఈకిడ్స్ ఆర్ ఏండ్ డీ మీనా, స్పోర్ట్స్ ఆర్‌పీ సురేష్, సాఫ్ట్ స్కిల్స్ ఇన్‌ఛార్జ్ జాజి రెడ్డి, కోఆర్డినేటర్లు సృజన్, దివ్య, ప్రియాంక పాల్గొన్నారు. వీరితో పాటు ఏడీ మంజుల, ఈచాంప్స్ వీపి కవిత, ఈకిడ్స్ వీపి, ఉపాధ్యాయులు విద్యార్థుల పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కల్లేపల్లి విజయసాగర్ కు ఘన సన్మానం

- మానవ హక్కుల పరిరక్షణ సమితి...
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం పట్ల హర్షం

కాల్వశ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:


మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లేపల్లి విజయసాగర్ నియమితులవడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో విజయసాగర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి,మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తుండ్ల రాజయ్య,పెద్దపల్లి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు ఎం.డి.రజాక్,మండల ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు చిలుముల రాజు,సమాచార హక్కు చట్టం పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి చిలుముల రామస్వామి,సమాచార హక్కు చట్టం పెద్దపెల్లి జిల్లా కోశాధికారి గుంట శ్రీకాంత్,సమాచార హక్కు చట్టం శ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు చిలుముల రాజేష్,నాయకులు మంతెన లక్ష్మణ్,కంకణాల సందీప్,కొండ సతీష్,తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో గల రైతు వేదిక లో ఎలినినో ప్రభావం ,యాసంగి పంటల సాగు,పంటల మార్పిడి,పంట అవశేషాల తగలబెట్టడం వలన నష్టాలు కేతి బచావో అభియాన్ పైన మండల వ్యవసాయ అధికారి టీ సంధ్య అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ...ప్రస్తుత యాసంగిలో నీటి లభ్యత తక్కువ ఉన్నందున పరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకొని ఎలినినో ప్రభావంను ఎదుర్కోవాలని,రైతులు వారు పొలాల యొక్క అవశేషాలను తగలబెట్టడం వలనే నేలలో పంటకు మంచి చేసే సూక్ష్మజీవులు కూడా చనిపోయి నేల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు.కేతి బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు నేల సంరక్షణ,సుస్థిర వ్యవసాయం, సమతుల్య ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.రైతుల పొలాల్లో మట్టి పరీక్షలు చేసిన అనంతరం వచ్చే భూసార పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టీ సంధ్య,గ్రామ ఉప సర్పంచ్ పత్తి శ్రీనివాస్ రెడ్డి,గ్రామ కార్యదర్శి శ్రీనివాస్,ఏఈవో సతీష్,రైతులు పాల్గొన్నారు.





శ్రీ వెంకటేశ్వర స్వామి 31వ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ



- స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పీఏసీ చైర్మన్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

చందానగర్ డివిజన్ పరిధిలోని విశాఖ శ్రీ శారదా పీఠం పాలిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సముదాయంలో నిర్వహించిన స్వామివారి 31వ (ఏకత్రింశ) బ్రహ్మోత్సవాల్లో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి 31వ బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా, అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఆశీస్సులు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అశోక్ గౌడ్, నాయకులు మిరియాల రాఘవరావు, రఘునందన్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రాంగోపాల్, నాని, హరి, రాజన్, ఆయాజ్ ఖాన్, బబ్లూతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.





ఇసుక, బూడిద దందాలతో కాంగ్రెస్ దోపిడీ

- అంతర్గాంలో కాంగ్రెస్ పాలన కాదు.. పోలీసుల జులుం నడుస్తోంది
- ప్రజా గొంతుకలను అణిచివేస్తున్నారు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి

అంతర్గాం, తెలంగాణ చౌరస్తా:

నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలో కాంగ్రెస్ పాలన సాగడం లేదని, పోలీసు వ్యవస్థ ను అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష గొంతుకలను అణిచి వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆరోపించారు. అంతర్గాం మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై,స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌పై తీవ్ర విమర్శలు చేశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ...రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు కూల్చి వేతలు,ఇసుక అక్రమ రవాణా,బూడిద దందాల ద్వారా అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారని ఆరోపించారు.ఆర్థిక బలంతో పోలీసు వ్యవస్థను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటూ ప్ర తిపక్ష నాయకులు పందుగ శుభాకాంక్షల కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం తొలగిస్తున్నార ని విమర్శించారు.ప్రజా సమస్యలను ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నించ డం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శిస్తూ,ప్రతిప క్షాల సభలు, సమావేశాలకు ఆటంకాలు కలిగిం చడం సరికాదన్నారు.గత మూడు సంవత్సరాల్లో రామగుండం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో ఎమ్మె ల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సూపర్ ఎల్‌నినో పై ముందస్తు చర్యలు ఏవి..?

రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రా ష్ట్రంలో రైతాంగం,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొనే ప్రమాదం ఉందని హరీష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయంపై కేసీఆర్,కేటీఆర్ పలుమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ,కా ళేశ్వరం ప్రాజెక్టులోని ఎత్తిపోతల పథకాల ద్వారా రిజర్వాయర్లను నింపడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.నీటి సమస్యలు తలె త్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు క్ష మాపణ చెప్పాలని అన్నారు.జీవో 127 అమలు చేసి మిగిలిన రైతులకు పట్టాలివ్వాలి అంతర్గాం మండలంలోని ఖుర్జుక భూముల సమస్యను ప్రస్తా విస్తూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో నంబర్ 127 అమలు చేసి పెద్దంపేట,రాయదండి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులకు పట్టాలు అందించా రని గుర్తు చేశారు.అయితే మిగిలిన రైతులకు ఇప్పటికీ పట్టాలు అందకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న రైతులందరికీ వెంటనే పట్టాలు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని,కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,కౌశిక హరి,మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మేకల సమన్న,అధికార ప్రతినిధి జహీద్ పాషా,అంతర్గాం మండల అధ్యక్షుడు కోల సంతో ష్,మూల విజయ రెడ్డి,మాజీ ఎంపీటీసీ కొలిపాక మధుకర్ రెడ్డి,పెద్దంపేట సర్పంచ్ శ్రీనివాస్,ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.






గ్రామ పంచాయతీ వనరులతో వ్యాపారం

- గ్రామ పంచాయతీకి మాత్రం పైసా ఆదాయం లేదా ?
- 16 ఏళ్ల సంజీవని వాటర్ ప్లాంట్ లెక్కలపై నిలదీత !
- ఎంపీడీవో,జిల్లా కలెక్టర్ కు ఉప సర్పంచ్ మునిగే రాజు ఫిర్యాదు

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

భీంపల్లి,గ్రామంలో సుమారు 16ఏళ్ల క్రితం ప్రజల విరాళాలతో,అప్పటి కరీంనగర్ ఎంపీ పొన్నం ప్ర భాకర్ సహకారంతో సంజీవని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.ప్లాంట్ నిర్వహణకు గ్రామ పంచాయతీకి చెందిన మంచినీరు,విద్యుత్ వినియోగించడంతో పాటు,విలువైన స్థలాన్ని సైతం గ్రామ పెద్దలు,విరాళంగా అందించింది.ఇంతటి ప్రజా వనరులను వినియోగించుకుంటున్న వాటర్ ప్లాంట్ నుంచి గ్రామ పంచాయతీకి ఇప్పటివరకు వచ్చిన ఆదాయం ఎంత...? నిర్వహణ ఖర్చు లెంత..? లాభ దేవీల వివరాలు ఏమిటి..? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.16 ఏళ్లుగా గ్రామ పంచాయతీకి ఆదాయ వ్యయాల వివరాలు చూపించకపోవడం పై గ్రామ ఉప సర్పంచ్ మునిగే



రాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రజల సొమ్ము,పంచాయతీ వనరులు వినియోగిస్తుంటే లెక్కలు చెప్పాల్సిన బాధ్యత లేదా అంటూ ప్రశ్నించారు.ఈ వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ కమలాపూర్ ఎంపీడీవోతో పాటు హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.



ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- జిల్లా అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య

కరీంనగర్, తెలంగాణ చౌరస్తా :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు ఆయాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగినది.ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు టేకుమల్ల సమ్మయ్య, మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు 18 వేల వేతనం ఇవ్వాలని,హెల్పర్లకు 10వేల వేతనం ఇవ్వాలని,బి ఎల్ ఓ డ్యూటీలో రద్దు చేయాలని,టీచర్లను,ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,పిఎఫ్,హెల్త్ కార్డులు ఇవ్వాలని,భీమా 25 లక్షలు ఇవ్వాలని,పెన్షన్ 10వేలు ఇవ్వాలని,ప్రీ ప్రైమరీ పాఠశాలలు రద్దు చేయాలని,గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని,పెండింగ్ లో ఉన్న ఇంటి అద్దెలు,గ్యాస్ బిల్లులు,ఆరోగ్య లక్ష్మీ,ఈవెంట్ బిల్లులు చెల్లించాలని,పోష్ గింజలు,ఎగ్స్,చింతపండు,పసుపు,కారం పొడి వంటి వస్తువుల టెండర్ ప్రక్రియను రద్దు చేసి నేరుగా టీచర్లు కొనుగోలు చేసే అవకాశం కల్పించాలని,టీ.ఏ,డి.ఏ లు ఇచ్చి ప్రతీ నెల ప్రాజెక్ట్ సమావేశాలు జరపాలని,రిటైర్డ్ అయిన వారికి ప్రభుత్వం ఇవ్వవలసిన బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఖటిక రెడ్డి బుచ్చన్న యాదవ్,ఏఐటియుసి నగర కార్యదర్శి కిమ్మసారపు నరసయ్య,తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్ప్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఏ రజిత,డి.రజిత,జిల్లా నాయకులు డి.భారతి,కే.అరుణ,బి.విజయ,ఎస్.ధనలక్ష్మి,కే.కమలక్క,శారద,ఆర్.సంధ్య,సుజాత,రాజాదేవి, టీచర్స్,ఆయాలు పాల్గొన్నారు.



పీడీఎస్ సన్నబియ్యం పట్టివేత

- జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్
- తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్న...
- వ్యక్తిపై 6-ఎ క్రిమినల్ కేసు నమోదు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యం పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్ తెలిపారు.జిల్లా పౌరసరఫరాల అధికారి కె.శ్రీనాథ్ ఆధ్వర్యంలో సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు పెద్దపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో గల ఇంటి నంబర్ 33136/ఎ/1లో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే సన్నబియ్యాన్ని ప్యాకేజీ బ్యాగుల్లో నింపుతున్న బజ్జూరి శంకర్,తండ్రి రాములును అధికారులు పట్టుకున్నారు.ఈ సందర్భంగా 23 బ్యాగుల్లో ఉన్న మొత్తం 6 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని స్వాధీనం చేసుకుని,భద్రత నిమిత్తం ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించారు.పీడీఎస్ సన్నబియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు బజ్జూరి శంకర్‌పై 6ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు .ఈ తనిఖీల్లో పోచయ్య (డి.టి.సి.ఎస్),రాజిరెడ్డి (సి.ఎస్.ఐ.),శ్రీనివాస్ (ఈ.టి.ఎఫ్ కానిస్టేబుల్) పాల్గొన్నారు.



పెర్క శ్యామ్ ని కలిసిన సింగరేణి కార్మికులు

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

ఆడెపు సందీప్ నేతృత్వం లో శ్రీరాంపూర్ ఏరియా ఆర్ కె 5 గని కార్మికులు టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్ ని కలిశారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకొని,వారి సమస్యలు, ఇబ్బందులపై కార్మికులతో సుదీర్ఘంగా చర్చించారు.కార్మికుల సంక్షేమం,హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.అదేవిధంగా పెర్క శ్యామ్ నాయకత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఆర్ ఎం ప్రసాద్ కి ప్రతిష్టాత్మక గ్లోరీ అవార్డు

- 30 ఏళ్ల నృత్య ప్రస్థానానికి గుర్తింపు

ఖమ్మం, తెలంగాణ చౌరస్తా:

నృత్యాన్ని తన శ్వాసగా,తన జీవితంగా మలచుకు నిగత 30 సంవత్సరాలుగా నిర్విరామంగా నృత్య రంగంలో సేవలందిస్తున్న ప్రముఖ నృత్య దర్శకులు,గురువు ఆర్ ఎం ప్రసాద్ కి ప్రతిష్టాత్మక గ్లోరీ అవార్డు లభించడం ఎంతో గర్వకారణం.మూడు దశాబ్దాల పాటు ఎంతో మంది ఔత్సాహిక కళాకారులను తీర్చిదిద్దుతూ,వేలాది మంది విద్యార్థులకు నృత్యంలో మెళకువలు నేర్పిస్తూ,కళా రంగానికి ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం.డాన్స్ అంటే కేవలం స్టెప్పులు మాత్రమే కాదు,అది ఒక క్రమశిక్షణ,ఒక సంస్కారం అని తన శిష్యులకు నిరూపించారు.ఎన్నో వేదికలపై తనదైన ముద్ర వేసి,ఎన్నో అవార్డులు,రివార్డులు అందుకున్న ప్పటికీ,ఈ గ్లోరీ అవార్డు ఆయన 30 ఏళ్ల సుదీర్ఘ కళా ప్రయాణానికి దక్కిన గొప్ప గుర్తింపు.కష్టపడి పనిచేస్తే కళ ఎప్పటికైనా గుర్తిస్తుందని ఆయన నిరూపించారు.ప్రముఖ సినీ నటులు సుమన్,సినీ దర్శకులు రేలంగి నరసింహారావు,వివిన్ ఆదిత్య, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ,హాస్యనటులు జెన్నీ,వందే భారత్ దర్శకులు, ప్రముఖ మిమిక్రీ కళాకారులు మల్లం రమేష్,ప్ర



ముఖ నటులు దర్శకులు మెజీషియన్ రామడుగు వసంత కుమార్,కమెడియన్ యాంకర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.ఇండియన్ గ్లోరీ అవార్డు 2026కళారత్న మూవీస్,రాజు ఎంటర్టైనర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ.30 సంవత్సరాలుగా విద్యార్థులకు డాన్స్ నేర్పిస్తూ ఎన్నో అవార్డు తెచ్చి ఖమ్మం ఖ్యాతిని తెలంగాణలో నెంబర్ వన్ గా చేసినందుకుగాను ఆర్.ఎం.ప్రసాద్ కి ఈ గ్లోరీ అవార్డు దక్కినందుకు ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ డా.కే.నవీన్ బాబు,ప్రిన్సిపల్ డా.బి.గోపాల్ వారిని వారిని అభినందించారు.

కాసిపేట-1 గనిని సందర్శించిన జనరల్ మేనేజర్



కాసిపేట,తెలంగాణ చౌరస్తా :

కాసిపేట1 ఇంక్లైన్ గనిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ సోమవారం సందర్శించారు.ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.గనిలో ప్రస్తుతం ఉత్పత్తి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నప్పటికీ,ఇదే స్ఫూర్తితో మరింత ఉత్పత్తిని పెంచి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.గనిలో జరుగుతున్న పనులను పరిశీలించి,అందుబాటులో ఉన్న యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు తెలిపారు.అనంతరం గనిలో అమలు చేస్తున్న రక్షణ చర్యలను పరిశీలించి,అధికారులకు,ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. రక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ,రక్షణ,ఉత్పత్తి రెండూ సమాన ప్రాధాన్యత కలిగినవని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో జనరల్ మేనేజర్‌తో పాటు కళ్యాణి ఖని ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్,ఐఈడీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్,మేనేజర్ సతీష్,రక్షణాధికారి సురేష్,సర్వేయర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్ లో అవినీతి

- బండి సంజయ్ నీతులు చెప్పడం కాదు
- మీ పార్టీ ప్రజా ప్రతినిధుల వ్యవహారం పై విచారణ చేయాలి
- బిజెపి పాలకవర్గం అవినీతి వసూళ్లకు..
- బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చెయ్యాలి
- టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్

కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:



కరీంనగర్‌లో బీజేపీ పాలకవర్గ సభ్యులు అవినీతి ,దోపిడీ,వసూళ్లు దందాల మీద కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వంత పార్టీ ప్రజా ప్రతినిధుల మీద బిజెపి పాలకవర్గ సభ్యుల మీద చేసిన వ్యాఖ్యలకు తానే స్వయంగా బాధ్యత తీసుకుని కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలన్నారు.నగరంలో బీజేపీ మేయర్ డిప్యూటీ మేయర్,కార్పొరేటర్ల మీద కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా బిజెపి కార్పొరేటర్లు ఇళ్ళు కట్టుకునే వారి దగ్గర నుండి వసూళ్ళ చేస్తున్నారని మీ పద్ధతి మార్చు కోవాలి లేకపోతే స్వంత పార్టీ కార్పొరేటర్ల ను బ్లాక్ లిస్ట్ లో పెడుతాను అని చెబుతున్నారు అంటే వారి పాలకవర్గ సభ్యుల పరిస్థితి ఎంతా చేయి దాటి పోయిందో కరీంనగర్ ప్రజలు ఆలోచన చెయ్యాలని తెలంగాణ రక్షణ సేన కోరుతుందన్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో బిజెపి పాలకవర్గం చేస్తున్న అవినీతి గురించి బిజెపి పార్టీ సమావేశంలో ఒక బాధ్యత కలిగిన కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని విచారణ సంస్థలు, అలాగే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని,బిజెపి నాయకులు ఒకవైపు అవినీతికి వ్యతిరేకమని ప్రకటనలు చేస్తారు కానీ మరోవైపు సొంత పార్టీ నేతలు చేసే అవినీతి మీద ఎందుకు చర్యలు తీసుకోరో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.బండి సంజయ్ ఇతరులకు నీతులు చెప్పే ముందు బీజేపీ మేయర్ డిప్యూటీ మేయర్,కార్పొరేషన్ లో వారి పార్టీ ప్రజాప్రతినిధుల అవినీతిని అరికట్టడానికి ప్రయత్నం చెయ్యాలని,బిజెపి కార్పొరేటర్లు గా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నగర ప్రజల ఓట్లు దండుకోని ఇప్పుడు మాత్రం ప్రతి పనికి ఒక రేటును ఒప్పందం చేసుకుని మేయర్ డిప్యూటీ మేయర్,పాలకవర్గ సభ్యులు ఒకరిని మించి మరొకరు పెద్దవత్తున అవినీతి వసూళ్ల చేస్తూ కోట్ల రూపాయలు గడుస్తున్నారని,కరీంనగర్ లో బీజేపీ కార్పొరేటర్లపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నగర ప్రజలు కూడా అర్థం చేసుకోవాలి విరి అవినీతి బాగోతం ఎంతా దూరం పోయిందో కరీంనగర్ లో బిజెపి పాలకవర్గం అవినీతి మీద నిష్పక్షపాత విచారణకు వారు అదేశించాలన్నారు.చోటే బాయ్ బడే బాయ్ ఒకటి కాదు అంటే మాత్రం అవినీతి మీద విచారణ జరగాలని ముందుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని ,కరీంనగర్ ప్రజల గొంతుకగా తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.